సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 30 । మే । 2023



ప్రజావాణికి 81 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 81 ఫిర్యాదులు నమోదయ్యాయని అధికారులు పేర్కొన్నారు.

-8లో ▸



ఉపాధి డబ్బుల కోసం నిరీక్షణ

ఉపాధి పనులు చేసిన కూలీలు డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
40.9 /29.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. సాయంత్రానికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

కిరోసిన్ డబ్బాతో కలెక్టరేట్‌కు..



కామారెడ్డి క్రైం : తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి రాజయ్య ప్రజావాణికి కిరోసిన్ డబ్బాతో రావడం కలకలం రేపింది. రాజయ్య సంచిలో కిరోసిన్ డబ్బాను బయట గేటు దగ్గర తనిఖీలు చేస్తున్న ఎస్సై ఉదయ్ శేఖర్ గమనించి స్వాధీనం చేసుకున్నారు. రాజయ్య మాట్లాడుతూ గ్రామ శివారులో తన తండ్రి పేరిట మూడున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ధరణి వెబ్‌సైట్‌లో, రెవెన్యూ రికార్డుల్లో అన్నీ సక్రమంగానే ఉన్నాయనీ, రైతుబంధు కూడా వస్తుందని కాని కొందరు వ్యక్తులు భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. 2018లో సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపాడు. ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు సర్వే చేయడం లేదన్నాడు. అందుకే కలెక్టరేట్‌లోనే ఆత్మహత్య చేసుకునేందుకు కిరోసిన్ డబ్బాతో వచ్చినట్లు తెలిపాడు. పోలీసులు అతడిని సముదాయించి పాలనాధికారి రవీందర్ వద్దకు తీసుకువెళ్లారు. తొందర్లోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో అతడు వెనుదిరిగాడు.

సాహస బాలల అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : ధైర్య సాహసాలు ప్రదర్శించిన 6 నుంచి 18 ఏళ్లలోపు వారి నుంచి సాహస బాలల జాతీయ అవార్డు కోసం అక్టోబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా సంక్షేమ అధికారి రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ సాహస బాలల జాతీయ అవార్డు అందిస్తుందన్నారు. పూర్తి వివరాలు www.iccw.co.in వెబ్‌సైట్‌లో లభిస్తాయని జిల్లా మహిళా సంక్షేమాధికారి పేర్కొన్నారు.

పంచాయతీకి తాళం



బిచ్కుంద(జుక్కల్) : చేసిన పనులకు బిల్లులు, ప్రజల సమస్యలు పరిష్కరించడం లేదని వార్డు సభ్యులు బిచ్కుంద జీపీకి సోమవారం తాళం వేసి నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, కారోబార్ సిబ్బందిని ఆఫీస్‌లోపలికి రానీయకుండా తలుపులు మూసి నలుగురు వార్డు సభ్యులు అడ్డుకొని తాళం వేసి అక్కడే కూర్చున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోపలికి ఎవరినీ రానివ్వలేదు. వార్డుల్లో చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని, జీపీ సమావేశం అంటూ సంతకాలు తీసుకుని ఏకాభిప్రాయం లేకుండా దొంగచాటున తీర్మానాలు చేసుకుంటున్నారని, సిబ్బంది సమయానికి రావట్లేదని, తాము విసిగిపోయి జీపీ తాళం వేశామన్నారు. కార్యదర్శి మాట్లాడుతూ చేసిన పనులకు నిబంధనల ప్రకారం నిధులొచ్చిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని ఆయన సభ్యులతో పేర్కొన్నారు. బిల్లులు ఇస్తామని నచ్చజెప్పడంతో శాంతించారు. ఈ తతంగం మూడు నాలుగు గంటలు కొనసాగింది. పనుల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందిపడ్డారు.

అమ్మో.. అల్లం

- కిలో రూ.200



దోమకొండ : అల్లం సామాన్యుడికి అందనంత దూరంలో ఉంది. మధ్య తరగతి కుటుంబాలు అమ్మో అల్లమా.. అనే పరిస్థితి నెలకొంది. ఉత్పత్తి, సరఫరాలో అంతరంతో ధరలు పైపైకి చేరుకుంటున్నాయి. కిలో రూ.200 వరకు ధర చేరుకుంది. ఒకవైపు శుభకార్యాలు, మరోవైపు పచ్చళ్ల సీజన్ కావడంతో అల్లం ధర అమాంతం పెరుగుతూ వస్తుంది. అల్లం ఎరుపు రంగుది కేరళ నుంచి, తెలుపు రంగుది మహారాష్ట్ర, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి కామారెడ్డి మార్కెట్‌కు చేరుకుంటాయి. హైదరాబాద్ మార్కెట్ నుంచే తమకు రూ.200 కిలో వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. దిగుమతిని తగ్గించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. గత మూడు నెలల నుంచి అల్లం ధర పెరుగుతూ వస్తుంది. మార్చి నెలలో కిలో రూ. 40 ఉన్న అల్లం ఏప్రిల్ నెలలో రూ.100 కు చేరుకుంది. ప్రస్తుతం రూ. 200 పలుకుతోంది.

ఆహారశుద్ధికి అడుగులు

ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు సదుపాయాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) పనులు చేపట్టింది. దీంతో భవిష్యత్తులో స్థానికులకు ఉపాధి లభించనుంది.

- పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధం !
- లింగంపల్లి సెజ్‌లో సౌకర్యాల కల్పన పనులు వేగవంతం
- స్థానికులకు దొరకనున్న ఉపాధి అవకాశాలు
- త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన



లింగంపల్లి సెజ్‌లో ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటులో భాగంగా పెట్టిన బోర్డు

సాక్షి, కామారెడ్డి : జిల్లాలోని సదాశివనగర్ మండలం లింగంపల్లి, జనగామ, తాడ్వాయి మండలంలోని కరడ్‌పల్లి గ్రామాల శివారులో 675 ఎకరాల్లో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలను సేకరించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలు దరఖాస్తులు చేసుకోగా అనుమతులు ఇచ్చారు. త్వరలోనే సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తి కాగానే సీఎం కేసీఆర్ సమయం తీసుకుని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో మెజారిటీ ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకునేందుకు ప్రతీ సీజన్‌లో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, సీసీఐ ద్వారా పత్తి, మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం వడ్ల కొనుగోలుతోనే సరిపెడుతోంది. మక్కలు కొనుగోలు చేయడానికి ఆదేశాలిచ్చినా ఇప్పటికీ కేంద్రాలు తెరవలేదు. జిల్లాలో మక్కలతో పాటు సోయా, పత్తి, పప్పుదినుసులు పెద్దఎత్తున సాగు చేస్తారు. వర్షాధారంపై ఆధారపడి వానాకాలంలో మక్క ఎక్కువగా సాగవుతుంది. యాసంగిలోనూ మక్క సాగు చేస్తారు. పత్తి పంట కూడా జిల్లాలో పెద్ద ఎత్తున సాగవుతుంది.

పరిశ్రమల ఏర్పాటుతో ప్రయోజనం

సోయాకు సంబంధించి పరిశ్రమలు జిల్లాలో ఎక్కడా లేవు. దీంతో రైతులు దళారులకు అమ్ముతున్నారు. ఏటా వానాకాలంలో 90 వేల ఎకరాల్లో సోయా సాగవుతోంది. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటైతే రైతుకు మేలు కలుగుతుంది. అలాగే జిల్లాలో మొక్కజొన్న పెద్దఎత్తున సాగవుతోంది. వర్షాకాలంలో 90 వేల ఎకరాల్లో, యాసంగిలో 50వేల పైచిలుకు ఎకరాల్లో మక్క సాగు చేస్తారు. స్థానికంగా స్టార్చ్ మిల్లులు లేకపోవడం రైతులకు శాపంగా మారింది. మక్క పంట చేతికి వచ్చే సమయంలో మార్కెట్‌లో ధర పడిపోతోంది. దీంతో రైతులు నష్టపోతున్నారు. మక్కలతో తయారయ్యే ఆహార ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం కలుగుతుంది. జిల్లాలో పత్తి సాగు ఎక్కువే. మద్నూర్ ప్రాంతంలో మాత్ర మే పత్తికి సంబంధించి జిన్నింగ్ మిల్లులు ఉన్నా యి. జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరాన ఉన్న ఆ ప్రాంతానికి ఇక్కడి నుంచి పత్తిని తీసుకెళ్లడం ఇబ్బందికరంగా ఉంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు కూడా అక్కడే ఏర్పాటు చేస్తోంది. గాంధారి, తాడ్వాయి, మాచారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, లింగంపేట, రాజంపేట తదితర మండలాల్లో పత్తి సాగు చేసిన రైతులు దళారులకే అమ్ముకోవాల్సి వస్తోంది. పప్పు దినుసులు వానాకాలంలో 30 వేల ఎకరాల్లో సాగవుతాయి. కంది, పెసర, మినుము రైతులు పంట చేతికందిన తర్వాత దళారులకే అమ్ముకోవాల్సి వస్తోంది. అలాగే జొన్న కూడా దళారులకు అమ్ముతున్నారు. పప్పు దినుసులకు సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఇక్కడి రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

సీఎం రాకపై ఆశలు

లింగంపల్లి సెజ్ శంకుస్థాపనకు సీఎం కేసీఆర్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం వస్తే మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు కలుగుతాయని భావిస్తున్నారు. అలాగే అభివృద్ధికి కూడా నిధులు పెద్ద ఎత్తున ప్రకటించే అవకాశాలున్నాయి. త్వరలోనే ఎల్లారెడ్డి నియోజక వర్గంలో సీఎం పర్యటిస్తారని ఆదివారం జిల్లాకు వచ్చిన మంత్రి హరీశ్‌రావ్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటనపై ఆశలు చిగురించాయి. పరిశ్రమల స్థాపనతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆశతో ఉన్నారు.



లింగంపల్లి సెజ్‌లో వేసిన తారు రోడ్డు

మౌలిక సదుపాయాల కల్పన

లింగంపల్లి సెజ్‌లో పరిశ్రమలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సెజ్‌లో ప్రధాన రహదారిని రెండు వరుసలుగా నిర్మించారు. అలాగే అక్కడ అవసరమైన మేర రోడ్ల నిర్మాణం పనులు ఇప్పటికే పూర్తి కావచ్చాయి. విద్యుత్తు సౌకర్యం కల్పించాల్సి ఉంది. కాగా ఎత్తు ప్రదేశం కావడంతో పాటు భూగర్భజలాల సమస్య తీవ్రంగా ఉన్న ఆ ప్రాంతంలో పరిశ్రమలకు కావాల్సినంత నీరు సమకూర్చడం పెద్ద సవాల్‌గా మారింది. అయితే మిషన్ భగీరథకు సంబంధించిన పైప్‌లైన్లు ఆ ప్రాంతం మీదుగా వెళ్తున్నందున పరిశ్రమలకు కావాల్సిన నీటిని తీసుకునేందుకు అనుమతులు కోరుతున్నట్లు సమాచారం. భూగర్భజలాల కోసం జియాలజిస్టులతో సర్వేలు నిర్వహించారు. అయితే నీటి లభ్యత తక్కువగా ఉండడంతో దూర ప్రాంతాల్లో బోర్లు తవ్వించి నీటిని పంపింగ్ చేయడమా ? మిషన్ భగీరథ నీటిని వాడుకోవడమా ? సెజ్‌లో ఉన్న కుంటలను స్టోరేజ్ ట్యాంక్‌లుగా మార్చుకుని నీటిని నిల్వ చేసి వాడుకునేందుకు ప్రయత్నాలు చేయాలా అన్నదానిపై అధికారులు చర్చిస్తున్నారు.

వైభవోపేతంగా దశాబ్ది వేడుకలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అధికారులు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం/కామారెడ్డి టౌన్ : వైభవోపేతంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. కామారెడ్డి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, అధికారులు వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎ స్ మాట్లాడుతూ జూన్ 2 నుంచి 22 వరకు దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ప్రణాళిక సి ద్ధం చేసుకోవాలన్నారు. రైతు దినోత్సవం రోజు జిల్లాలో ఉన్న రైతు వేదికల్లో వేడుకలు జరగాలన్నారు. జూన్ 8న ఊరురా చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లోని చెరువుల దగ్గర బతుకమ్మ, బో నాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజ, భోజనాలు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణకు అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలన్నారు. జూన్ 9న సంక్షేమ సంబురాలు సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండవ విడత గొర్రెల పంపిణీ, అవకాశం ఉన్న చోట ఇంటి పట్టాల పంపిణీ, బీసీ కులవృత్తుల వారికి ఆర్థికసాయం ప్రారంభించాలన్నారు. బీసీ కుల వృత్తుల ఆర్థికసాయంపై నివేదిక అందాక దాని ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ 9న ప్రారంభించాలన్నారు. మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, వైద్యారోగ్య శాఖ దినోత్సవం రోజు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయాలన్నారు.

వేడుకగా నిర్వహించాలి

సీఎస్‌తో వీసీ అనంతరం మండల స్థాయి అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 2న కలెక్టర్ కార్యాలయం ఎదుట పతాకావిష్కరణకు స్పీకర్ పోచారం హాజరవుతారని, ఉత్సవాలను పకడ్బందీ ప్రణాళిక తో నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఛీ..ఛీ.. చిల్లర పంచాయితీ!

కిస్సా కుర్సీకా..!

- తెలంగాణ వర్సిటీ పరువును బజారుకీడ్చారు..
- రిజిస్ట్రార్ పదవి కోసం యాదగిరి, కనకయ్య వాదులాట
- బయటి వ్యక్తులను వర్సిటీలోకి తీసుకొచ్చి గొడవ చేయించే సంస్కృతికి బీజం
- ఈసీ తీర్మానాల అమలులో అడ్డంకులు సృష్టిస్తున్న వైనం



ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి పంపిన లేఖను చూపుతున్న రిజిస్ట్రార్ యాదగిరి, పక్కన కనకయ్య

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాజకీయ పార్టీల్లో గల్లీ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పదవుల కోసం కొట్లాటలు నడుస్తుండడం సర్వసాధారణం. కానీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో మాత్రం అంతకు మించి అన్నట్లుగా రిజిస్ట్రార్ కుర్చీ విషయంలో ఎడతెగని రగడ కొనసాగుతుండడం విస్తుగొలుపుతోంది. వీసీ రవీందర్ గుప్తా వ్యవహార శైలి, అక్రమ నియామకాల నేపథ్యంలోనే రిజిస్ట్రార్ పదవి విషయంలో నువ్వానేనా అనేవిధంగా పంచాయితీ నెలకొన్నట్లు వర్సిటీ వర్గాలు, విద్యార్థి సంఘాలు అంటున్నాయి. రెండేళ్ల కాలంలో ఏకంగా ఆరుగురు రిజిస్ట్రార్లు పదిసార్లు కుర్చీలు మార్చుకున్న పరిస్థితి నెలకొంది. మళ్లీ తాజాగా సోమవారం వర్సిటీలో రిజిస్ట్రార్ కుర్చీ విషయమై ఆ చాంబర్‌లో మూడు గంటల పాటు లొల్లి నడిచింది. పాలకమండలి తీర్మానం మేరకు రిజిస్ట్రార్‌గా నియమితులైన యాదగిరి కుర్చీలో కూర్చున్నారు. ఇదే సమయంలో కనకయ్య వచ్చి తనను వీసీ రిజిస్ట్రార్‌గా నియమించారని, తనకే కుర్చీలో కూర్చునే అధికారం ఉందని వాదించారు. పాలకమండలి, ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వడంతోనే రిజిస్ట్రార్ బాధ్యతలు తీసుకున్నట్లు యాదగిరి తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాలన్నీ అక్కడకు వచ్చి రిజిస్ట్రార్ యాదగిరికి మద్దతుగా నిలిచాయి. చివరకు అందరూ కలిసి ఒక తీర్మానానికి వచ్చారు. రిజిస్ట్రార్ ఎవరో తేలేవరకు వీసీ, రిజిస్ట్రార్ గదులకు చాంబర్లకు తాళాలు వేయాలని నిర్ణయించారు. బయట నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు, ఒక్క విద్యార్థి సంఘం మాత్రం కనకయ్యకు మద్దతుగా నిలిచాయి. మొత్తానికి రాజకీయ పార్టీల్లో గల్లీ స్థాయిలో పదవి కోసం కొట్లాడుకున్న మాదిరిగా చాలాసేపు వ్యవహారం కొనసాగడం విశేషం బయటి వ్యక్తులను తీసుకొచ్చి గొడవ చేయించే విధంగా సంస్కృతికి బీజం వేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో కుర్చీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయంశమైంది.

అక్రమాల పుట్ట పగులుతుందనేనా..?

వర్సిటీకి అత్యున్నతమైన పాలకమండలి తీర్మానాలను అమలుచేసే విషయంలో వీసీ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తుండడం గమనార్హం. ఇప్పటికే కనకయ్యతో కలిసి వీసీ అక్రమ నియామకాలు చేయడం, విచ్చలవిడిగా సుమారు రూ. 40కోట్ల మేర అధికారిక అనుమతి లేకుండా ఖర్చులు చేయడం, అడ్వాన్సులు చెల్లించడం తదితర వ్యవహారాలపై విచారణకు ఇప్పటికే ఈసీ ఐదుగురు సభ్యుల కమిటీ నియమించింది. ఈ కమిటీ ఒక్కరోజు విచారణ చేస్తేనే రూ. కోటి మేర అక్రమ చెల్లింపులు వెలుగుచూశాయి. కమిటీ విచారణ నేపథ్యంలో 55వ పాలకమండలి తీర్మానాలపై వీసీ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. మళ్లీ తర్వాత 56, 57 పాలకమండలి తీర్మానాలపైనా స్టే తెచ్చుకునేందుకు వీసీ ప్రయత్నాలు చేస్తున్నారు. వీసీని ఎవరు వెనక ఉండి నడిపిస్తున్నారో కానీ, ఉన్నత విద్యాశాఖ కమీషనర్ నవీన్ మిట్టల్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తుండడం గమనార్హం. కనకయ్య అక్రమంగా ప్రమోషన్ పొందాడని, పీహెచ్‌డీ ప్రవేశాల్లో కూడా అక్రమాలు చేసినట్లు ఈసీ నిర్ణయించింది. ఈ వ్యవహారాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఈసీ నిర్ణయం తీసుకుంది.

గొల్ల, కురుమలకు గుడ్‌న్యూస్

- రెండో విడత గొర్రెల పంపిణీకి సిద్ధం
- 6,099 యూనిట్లకు ఏర్పాటు
- యూనిట్‌కు రూ.50 వేల సబ్సిడీ పెంచిన సర్కారు
- జూన్ 9 నుంచి పంపిణీ ప్రారంభం



కామారెడ్డి రూరల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ రెండో విడత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2017 జూలైలో ఈ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చింది. మొదటి విడత పంపిణీ తర్వాత అనేక అవాంతరాలు ఎదురయ్యాయి. మొదటి, రెండో విడతలో మిగిలిన గొర్రెల యూనిట్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో యూనిట్ల కోసం డీడీలు తీసిన లబ్ధిదారులతో పాటు ఆయా పార్టీల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. తాజాగా లబ్ధిదారుల నుంచి 25 శాతం వాటాను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లావ్యాప్తంగా 16,895 మంది గొల్ల కురుమలు ఉండగా మొదటి విడతలో డ్రా పద్ధతిలో 10,796 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మిగితా 6099 మందికి రెండో విడతలో గొర్రెలు అందించనున్నారు. గతంలో పోలిస్తే యూనిట్ ధర పెరగడంతో లబ్ధిదారుడిపై రూ.12 వేల అదనపు భారం పడనుంది.

ఇప్పటివరకు 200 మంది..

గొర్రెల సబ్సిడీ యూనిట్ ధర రూ. 1.25 లక్షలు ఉండగా ప్రభుత్వం మరో రూ. 50 వేలు పెంచింది. పెరిగిన యూనిట్ ధర రూ.1,75,000 కాగా అందులో లబ్ధిదారుడి వాటా రూ.43,750 కట్టిస్తున్నారు. ప్రస్తుతం లబ్ధిదారుడి వాటాను చెల్లించేందుకు కలెక్టర్ పేరుపై బ్యాంకులో అకౌంట్లు తీశారు. లబ్ధిదారులు వారి వాటాను అకౌంట్‌లో జమ చేయగానే కలెక్టర్ లాగిన్‌లో కనిపిస్తుంది. రెండో విడతలో ఇప్పటికే 200 మంది వరకు డీడీలు సైతం తీసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

వాటాల సేకరణ..

2017లో గొర్రెల యూనిట్ల పంపిణీకోసం ప్రతి ఊరిలో డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో యూనిట్ ధర (20 గొర్రెలు/ఒక పొట్టేలు) రూ.1.25 లక్షలు కేటాయించారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించారు. జిల్లాలో మొదటి విడతలో 16,895 యూనిట్లు మంజూరుకాగా ఇందులో 10,796 వేలమంది గొల్ల కురుమలు డీడీలు తీసివ్వగా వారికి గొర్రెలను పంపిణీ చేశారు.

గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తి..

జూన్ 9వ తేదీ నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తాం. జిల్లాలో 314 సొసైటీలు ఉండగా 2017 వరకు జిల్లాలో గొర్రెల పెంపకందారుల సొసైటీలో 17,329 మంది సభ్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి మాత్రమే 16,895 గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. విడతల వారీగా మంజూరు చేస్తున్నారు. తొలివిడతలో రెండు జాబితాలు తయారు చేశారు. ఇందులో 10,796 యూనిట్లు మంజూరయ్యాయి. గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయింది. రెండో విడతకు 6,099 యూనిట్లు కేటాయించారు. వీటిని పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– కె సింహారావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, కామారెడ్డి

ధరణితో రైతులకు ఉరి

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదట 'ధరణి'ని రద్దు చేస్తాం
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

భిక్కనూరు : రాష్ట్రంలో అమలు చేస్తున్న ధరణి పోర్టల్‌తో రైతులకు ఉరిగా మారిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ రైతులను ఈ బాధల నుంచి విముక్తి చేసేందుకు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి సంతకం ధరణి పోర్టల్ రద్దుపైనే కాంగెస్ సీఎం చేస్తారన్నారు. వచ్చే ఎనిమిది నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అఖండ మెజార్టీతో అధికారంలోకి వస్తుందన్నారు. వరంగల్‌లో రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను, హైదరాబాద్‌లో ప్రియంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌ను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. గ్యాస్ సిలిండర్‌ను రూ. 500కే ఇస్తామని, రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ ఏకకాంలో చేస్తామని, కొత్త రుణాలను వెంటనే అందజేస్తామన్నారు. కౌల్ రైతులకు కూడా ఇందిరమ్మ రైతు భరోసా పథకాన్ని అందిస్తామన్నారు. వరిధాన్యం క్వింటాల్‌కు రూ. 2,500, మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,200 చెరకు క్వింటాల్‌కు రూ. 4 వేలతో పాటు పసుపుబోర్డు తెస్తామన్నారు. రైతు కమీషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోల భర్తీ చేస్తామన్నారు. 18 ఏళ్ల పైబడిని ప్రతి యువతికి ఎలక్ట్రిక్ బైక్ అందిస్తామన్నారు. ప్రజలు సీఎం కేసీఆర్‌ను నమ్మడం లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్నారు. ఈ సమావేశంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, పట్టణాధ్యాక్షుడు అందే దయాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తాటిపాముల లింబాద్రి, నాయకులు సుధాకర్‌రెడ్డి, సాయికృష్ణ, జేపీ వెంకటేశ్, సిద్ధ రాములు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సదస్సుకు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్ : ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో అమెరికాలో నిర్వహిస్తున్న ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్(ఐఓసీయూఎస్ఏ) సమావేశాలకు మాజీ మంత్రి షబ్బీర్ అలీకి ప్రత్యేక ఆహ్వానం అందింది. వచ్చేనెలలో ఈ సమావేశాలు జరుగనున్నాయి. సమావేశాల్లో రాహుల్‌గాంధీతో పాటు షబ్బీర్‌అలీ పాల్గొ ననున్నారు. డిజిటలైజ్డ్ ప్రపంచంలో మానవాళిని ప్రభావితం చేసే అంశాలు, ప్రపంచ సమస్యలపై ప్రసంగం ఉటుందని షబ్బీర్ అలీ సాక్షికి తెలిపారు.

క్లుప్తంగా

జీపీఎఫ్ అకౌంట్ అప్‌డేషన్ వేగవంతం చేయాలి



కామారెడ్డిఅర్బన్: కామారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల జీపీఎఫ్ అకౌంట్ అప్‌డేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ నాయకులు సోమవారం నిజామాబాద్ జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. నిజామాబాద్ నుంచి కామారెడ్డి జిల్లాగా విడిపోయి దాదాపు ఏడు సంవత్సరాలు అవుతున్నా ఉపాధ్యాయుల జీపీఎఫ్ అకౌంట్‌ను బదిలీ చేయనందున ఇబ్బందులు పడుతున్నామన్నారు. పార్టు ఫైనల్ లోన్లు, పెండింగ్ లోన్ల ఫైళ్లను పరిష్కరించాలని కోరారు. టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజీబుద్దీన్, రజాక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుస్సాముద్దీన్‌ను అభినందించిన మంత్రి



నిజామాబాద్ నాగారం: వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన నిజామాబాద్ నగరానికి చెందిన హుస్సాముద్దీన్‌ను సోమవారం హైదరాబాద్‌ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

'ఓపెన్' అక్రమాలపై రేపు ఆర్డీవో విచారణ

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లాలో గత జరిగిన ఇంటర్, టెన్త్ ఓపెన్ అక్రమాలపై కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ ఈ నెల 31న విచారణ జరపనున్నారు. ఈ అక్రమాలపై విచారణ కమిటీ సభ్యులుగా ఎల్లారెడ్డి ఎంఈవో వెంకటేశం, సదాశివనగర్ ఎంఈవో యోసఫ్‌ను నియమించారు. వారు విచారణ, సేకరించిన సాక్ష్యాల నివేదికను 31న ఆర్డీవోకు సమర్పించాల్సి ఉంటుంది. విచారణ తేదిన వ్యక్తిగతంగా విచారణ కమిటీ సభ్యులతో పాటు ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు, ఆరోపణలు ఎదుర్కొన్న పరీక్షల నిర్వహణ అధికారులు హాజరుకావాలని ఆర్డీవో తెలిపారు.

చిన్నారిపై అత్యాచార యత్నం

బోధన్: బోధన్ పట్టణానికి చెందిన ఐదేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. ఈ నెల 26న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణంలోని వీధుల్లో గాజులు అమ్ముకునే ఖాజామియా (40) చిన్నారికి మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిజామాబాద్ జిల్లా మాణిక్ బండార్‌కు చెందిన గంగాధర్ డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రతాప్ నిందితుడికి జైలుశిక్ష, రూ.300 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

'ఉపాధి' డబ్బుల కోసం నిరీక్షణ

- తపాలా ఉద్యోగుల్లేక కూలీల తిప్పలు
- నెలలు గడుస్తున్నా అందని కూలి

నిజాంసాగర్: ఉపాధి హామీ పనులు చేసిన కూలీలు డబ్బుల కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. మండుటెండల్లో చెరువులు, గుట్టలు, అటవీ ప్రాంతాల్లో ఉపాధి పనులు చేసిన కూలీలకు కూలి డబ్బులు సకాలంలో అందడం లేదు. జిల్లాలో 2,58,096 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉండగా 5,05,255 మంది కూలీలు ఉన్నారు. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు రూ.1688.26 కోట్ల విలువైన పనులను ఈజీఎస్ కింద చేపట్టారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మండల కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీవోలు ఉపాధి పనులను చూస్తున్నారు. కూలీ పనులతో పాటు మెటీరియల్ పనులకు సంబంధించిన కొలతలు, ఎంబీ రికార్డులు, కూలీల హాజరు మస్టర్లను పర్యవేక్షిస్తూ ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. పనులు చేసినా రెండు, మూడు నెలలకు కూడా కూలి డబ్బులు రావడం లేదు. అంతేకాకుండా డబ్బుల పంపిణీ ప్రక్రియను పోస్టల్ సిబ్బందికి అప్పగించడంతో బయో మెట్రిక్ ద్వారా ఉపాధి డబ్బులను కూలీలకు చెల్లిస్తున్నారు. గ్రామాల వారీగా పోస్టాఫీస్ ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉండటంతో కూలీ డబ్బులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం అవుతోంది. జిల్లా వ్యాప్తంగా రూ.25 కోట్ల మేర డబ్బులు కూలీలకు చెల్లించాల్సి ఉంది.



చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

బీపీఎంలు లేక..

నిజాంసాగర్ సబ్ పోస్టాఫీస్ పరిధిలో ఒడ్డేపల్లి, అచ్చంపేట, మల్లూర్, అన్నాసాగర్, మహమ్మద్‌నగర్, హసన్‌పల్లి గ్రామాల్లో బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. అచ్చంపేట, ఒడ్డేపల్లిలో తప్పా మిగతా గ్రామాల్లో బీపీఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాంతో ఆయా అక్కడ ఉపాధి హామీ డబ్బులు పంపిణీకి తపాలా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పను లు చేసిన కూలీలు కూలి డబ్బుల కోసం పోస్టాఫీసు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. త్వరగా డబ్బులు అందించాలని కోరుతున్నారు.

పైసలు పంచుతలేరు

నాలుగు నెలల కిందట చేసిన పనులకు ఇంత వరకు కూలి డబ్బులు రాలేదు. ఎండల్లో ఉపాధి పనులు చేస్తున్నా పైసలకు దిక్కు మొక్కు లేదు. పైసలు పంచెటోళ్లు గ్రామానికి వస్తలేరు.

– గొట్టం గంగాధర్, నర్వ

బీపీఎంల కొరత ఉంది

చాలా గ్రామాల్లో బ్రాంచ్‌పోస్టు మాస్టర్ల కొరత ఉండటంతో ఉపాధి డబ్బుల పంపిణీ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. పోస్టు మాస్టర్లు లేకపోవడంతో సిబ్బందితో ఆసరా పింఛన్లు పంపిణీ చేయిస్తున్నాం. ఉపాధి డబ్బుల పంపిణీకి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బీపీఎం పోస్టుల భర్తీ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– లింగొండ, నిజాంసాగర్, ఎస్‌పీఎం

ప్రజావాణికి 81 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏవో రవీందర్



మాట్లాడుతున్న టీజేఎస్ నాయకులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 81 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టరేట్ పాలనాధికారి రవీందర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని టీజేఎస్ నాయకులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, జిల్లా నాయకుడు కుంభాల లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ.. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని చెప్పిందన్నారు. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు సహాయం ఇవ్వలేదన్నారు. ఇండ్లు కూలిపోయిన వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు

సుభాష్‌నగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గమనించని ఫిర్యాదుదారులు కొందరు కలెక్టరేట్‌కు రావడంతో వారి కోసం గేట్ వద్ద ప్రత్యేకంగా ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేశారు. బాధితులు వినతిపత్రాలను పెట్టెలో వేసి, పేర్లు నమోదు చేయించుకున్నారు.



కలెక్టరేట్ బయట బాక్సులో ఫిర్యాదులు వేస్తున్న ప్రజలు

సివిల్స్ ర్యాంకర్‌ను అభినందించిన కలెక్టర్



మహేష్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి అఖిల భారత సర్వీసులకు ఎంపికైన బోధన్ పట్టణానికి చెందిన కంతం మహేష్‌కుమార్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం తన ఛాంబర్‌లో అభినందించారు. మహేష్‌కు మిఠాయి తినిపించి, జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయిని అధిష్టించాలని ఆకాంక్షించారు. డీఎంహెచ్‌వో సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో..

నగరంలోని కలెక్టరేట్‌లోగల టీఎన్‌జీవో కార్యాలయంలో సోమవారం మహేష్‌కుమార్, ఆయన కుటుంబసభ్యులను ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. నేతికుంట శేఖర్, సంగం అమృత్‌కుమార్, చిట్టి నారాయణరెడ్డి, ఆకుల ప్రసాద్ పాల్గొన్నారు.

వేగంగా ఆర్‌అండ్‌బీ శాఖ పునర్విభజన

- జూన్ 10 నుంచి అందుబాటులోకి కార్యాలయాలు

నిజామాబాద్‌నాగారం : జిల్లాలోని ఆర్‌అండ్‌బీ పునర్విభజన ప్రక్రియ వేగంగా జరుగుతోంది. జిల్లాలో కొత్త సబ్ డివిజన్లతో పాటు ఎలక్ట్రికల్ డివిజన్, నేషనల్ హైవే, బిల్డింగ్ సెక్షన్, బిల్డింగ్ సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. కార్యాలయాల కోసం భవనాలు, గదులు సిద్ధం చేస్తున్నారు. జూన్ 10 నుంచి అధికారికంగా కార్యాలయాలు అందుబాటులోకి రానున్నాయి. మంత్రి ప్రశాంత్‌రెడ్డి వీటిని ప్రారంభించనున్నారు.

పునర్విభజన ఇలా..

- నిజామాబాద్ జిల్లా ఆర్‌అండ్‌బీ సర్కిల్ పరిధిలో కొత్తగా సబ్‌డివిజన్‌లు, ఎలక్ట్రికల్ కార్యాలయం, ఇతర సెక్షన్‌లు అన్ని ఏర్పాటు కానున్నాయి.
- వేల్పూర్‌లో కొత్తగా సబ్ డివిజన్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతానికి భీమ్‌గల్ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఏఈ ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.
- బిల్డింగ్ సబ్‌డివిజన్, బిల్డింగ్ సెక్షన్ కార్యాలయాలు జిల్లా కేంద్రంలోని డిప్యూటీ ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. డిప్యూటీ ఈఈ, ఏఈలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.
- నేషనల్ హైవే సర్కిల్ కార్యాలయం కొత్తగా ఏర్పాటు కానుంది. ఇందులో మొత్తం 11మంది అధికారులను నియమించనున్నారు. ప్రస్తుతం డిప్యూటీ కార్యాలయంలో గదులను సిద్ధంగా ఉంచారు.
- ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ కార్యాలయాన్ని పక్కనే ఉన్న మరో భవనంలోకి మార్చారు.
- ఎలక్ట్రికల్ డివిజన్ కార్యాలయం నగరంలోని ఎస్‌ఈ ఆఫీస్‌లో ఏర్పాటు కానుంది. ఈఈ పోస్టుతోపాటు, డిప్యూటీ ఈఈ, ఏఈ పోస్టులు రానున్నాయి.



ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సర్కిల్ కార్యాలయం

పెరుగుతున్న పసుపు ధర

- క్వింటాలుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు హెచ్చింపు
- సీజను ముగిసిన తర్వాత పెరగడంతో రైతులకు దక్కని ప్రయోజనం

మోర్తాడ్: పసుపు నిల్వలు రైతుల వద్ద తగ్గిపోయిన తర్వాత ధర పెరుగుతుండటంతో నిల్వ చేసుకున్న స్టాకిస్టులు, వ్యాపారులకే ప్రయోజనం కలుగనుందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. పసుపు సాగు విస్తీర్ణం తగ్గి, దిగుబడిపై ప్రభావం చూపినా సీజనులో పంటకు ధర పెరుగకపోవడంతో రైతులకు లాభాలు దక్కలేవు. ఒక క్వింటాలు పసుపునకు మొదట్లో రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ధర పలికింది. సీజను ముగిసే దశలోనే రూ.6వేల వరకు ధర లభించింది. ఇప్పుడు మాత్రం ఏకంగా క్వింటాలుకు రూ.1,500 వరకు ధర పెరుగడంతో రైతులు నిట్టూర్పువిడుస్తుండగా, పసుపు నిలువ చేసుకున్నవారు సంబరపడుతున్నారు. సాగు విస్తీర్ణం తగ్గడం, అతివృష్టితో దిగుబడి సన్నగిల్లడంతో మార్కెట్‌లో పసుపుకు కొరతనే ఏర్పడింది. ఈ నేపథ్యంలో క్వింటాలు పసుపునకు రూ.10వేల నుంచి రూ.12వేల వరకు ధర దక్కుతుందని రైతులు ఆశించారు. కమోడిటీ ప్రభావం, వ్యాపారుల సిండికేట్‌తో పసుపు ధరలో వృద్ధి కనిపించలేదు. రైతుల వద్ద పసుపు నిలువలు తగ్గిపోయిన తరువాత ధర జంప్ కావడంతొ కొందరికే ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని వెల్లడైతుంది. గతంలోను సీజను ముగిసిన తరువాతనే పసుపుకు ధర పెరిగింది.

అవగాహన లోపం

రైతులు పసుపును తక్కువ ధరకు విక్రయించకుండా నిలువ చేసుకుని ధర పెరిగినప్పుడే అమ్ముకునే విధంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం(ఎంఐఎస్)ను అమలులోకి తీసుకవచ్చినా రైతులకు అవగాహన లేక ఈ పథకంను సద్వినియోగం చేసుకోలేకపోయారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి నిధులను మార్కెటింగ్ శాఖ సమకూరుస్తుందని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఎక్కడ కూడా ఎంఐఎస్‌ను రైతులు వినియోగించుకోలేదు. మార్కెటింగ్ శాఖ గోదాంలు లేదా కోల్డ్‌స్టోరేజ్‌లలో పసుపును నిలువ చేసుకుని దీని విలువపై తక్కువ వడ్డీకి రుణం పొందడానికే ఎంఐఎస్‌ను అమలులోకి తీసుకవచ్చారు. రైతులకు ఎంఐఎస్ పథకంపై సరైన అవగాహన లేకపోవడం శాపంగా మారింది. ఏదిఏమైనప్పటికి పసుపు పంటకు సీజను ముగిసిన తరువాత ధర పెరగడం వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం లేదని చెప్పవచ్చు.



నిజామాబాద్ మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన పసుపు కొమ్ములు

లారీపై నుంచి పడి డ్రైవర్ మృతి



వెంకటేశ్ మృతదేహం

లింగంపేట: మండలంలోని నల్లమడుగు పెద్ద తండా కొనుగోలు కేంద్రం వద్ద లారీపై నుంచి పడి డ్రైవర్ వెంకటేశ్ (42) మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. సోమవారం సాయంత్రం నల్లమడుగు పెద్ద తండా కొనుగోలు కేంద్రంలో లారీలో వడ్ల బస్తాలు లోడ్ చేశారు. ఈ క్రమంలో డ్రైవర్ లారీపైకి ఎక్కి ధాన్యం బస్తాలకు తాడు సరిగా కట్టారా లేదా అని చూస్తుండగా ప్రమాదవశాత్తు జారీ పడి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీపై నుంచి కింద పడడంతో తలకు బలమైన గాయాలు కావడంతో మృతి చెందినట్లు తెలిపారు. లారీతో పాటు డ్రైవర్ కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందినదిగా గుర్తించారు.

నీళ్లు పడ్డాయని ఘర్షణ

నందిపేట్: నందిపేట మండల కేంద్రంలో మంగళవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు నందిపేటలోని ఒక టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేసిన అనంతరం చేయి కడుక్కునే సందర్భంలో పక్కన ఉన్న ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిపై నీళ్లు పడ్డాయి. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి వర్గం వారు హోటల్ వద్దకు వచ్చి సదరు ఇద్దరు వ్యక్తులను చితకబాదారు. దీంతో వారిద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసులను వివరణ అడగ్గా ఇరువర్గాల వారు ప్రాథమిక సమాచారం ఇచ్చారు కానీ రాతపూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నిధి ఆప్కే నికట్ విజయవంతం



మాట్లాడుతున్న అధికారి శ్రావన్‌కుమార్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమం సోమవారం నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం దేశాయి బీడీ కంపెనీలో జరిగింది. పీఎఫ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి శ్రావణ్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈపీఎఫ్‌వో కింద కవర్ చేయబడిన యజమానులు, పీఎఫ్ చందాదారులు, పెన్షనర్లు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి సమస్యలను, ఫిర్యాదులను సేకరించి తక్షణమే పరిష్కరించారు. ప్రతినెలా 27న నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

కేదార్‌నాథ్ యాత్రకు వెళ్తూ యువకుడి మృతి



వాసు (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: కేదార్‌నాథ్ యాత్రకు బయలుదేరిన పెర్కిట్‌కు చెందిన దోండి వాసు(24) ఉత్తర్ ప్రదేశ్‌లోని లలితపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ వాహనాన్ని అద్దెకు తీసుకొని హైదరాబాద్ నుంచి శనివారం మధ్యాహ్నం వాసు తన ఇద్దరు మిత్రులతో కలిసి కేదార్‌నాథ్ యాత్రకు బయలు దేరాడు. ఆదివారం తెల్లవారుజామున వీరి వాహనం డివైడర్‌ను ఢీకొని, ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో వాసు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు మిత్రులు స్వల్ప గాయలతో బయటపడ్డారు. వాసు హైదరాబాద్‌లోని ఓ క్యాబ్ కంపెనీలో పనిచేస్తున్నాడు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు

వర్ని/బోధన్: హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్‌కుమార్ తీర్పునిచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య, వర్ని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. వర్ని మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన త్యాపల సాయిబాబా గతేడాది ఏప్రిల్‌లో అదే గ్రామానికి చెందిన తన పెద్దనాన్న త్యాపాల చిన్నారెడ్డి, ఆయన భార్య లలిత, కూతురు అక్షరపై దాడి చేశాడు. వర్ని పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా సెషన్స్ జడ్జి సాయిబాబాకు ఏడాది జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధించారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్

మద్నూర్: తనకు వారసత్వంగా రావాల్సిన భూమి దక్కదనే కోపంతో మండలంలోని సోనాలలో తమ్ముడిని హత్య చేసిన రాజు పాటిల్‌ను సోమవానం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. సోనాలకు చెందిన విజయ్ పాటిల్‌ను ఆదివారం వేకువజామున అతడి అన్న రాజు పాటిల్ కత్తితో పొడిచి దారుణ హత్య చేయడంతో విచారణ జరిపామన్నారు. వారసత్వంగా రాజు పాటిల్‌కు రావాల్సిన భూమిని విజయ్ పాటిల్ తనకు రానివ్వకుండా ఒక్కడే అనుభవిస్తూ ఖర్చు చేస్తున్నాడనే కోపంతో హత్య చేసినట్లు తేలిందని ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: ఆర్మూర్‌లోని రాజారాంనగర్‌లో పేకాడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేష్ తెలిపారు. వారి వద్ద 14 సెల్‌ఫోన్‌లు, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

లక్ష్మీ గణపతి ఆలయంలో చోరీ



మోపాల్: నగర శివారులోని బోర్గాం (పి)లోగల శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు, ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలోని ప్రధాన హుండీని దుండగులు ఎత్తుకెళ్లి స్థానికంగా ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఎన్‌క్లేవ్ వెంచర్‌లో ధ్వంసం చేశారు. అందులో మూడు నెలలుగా భక్తులు సమర్పించిన నగదు సుమారు రూ.లక్ష వరకు ఎత్తుకెళ్లారు. హుండీని అక్కడే వదిలేశారు. పోలీసులు, క్లూస్‌టీం అక్కడికి చేరుకుని వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. ఆలయ వ్యవస్థాప క అధ్యక్షుడు అరుణ్‌కుమార్ శర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



బాగయ్య

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక్ నగర్‌కు చెందిన బాగయ్య(75) అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. బాగయ్య ఈ నెల 28న తన కూతురి ఇంటి నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. నిజామాబాద్ రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా దొరకపోవడంతో బాగయ్య కుమారుడు దత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోధన్‌కు చెందిన ఒకరు..



సంతోష్

బోధన్: బోధన్‌లోని పాన్‌గల్లీ ప్రాంతానికి చెందిన కందికట్ల సంతోష్ (39) అదృశ్యమైనట్లు టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 26న ఉదయం 10.30 గంటల సమయంలో ఇంట్లో భార్యతో గొడవ పడి సంతోష్ బయటకు వెళ్లిపోయాడని, తిరిగి రాలేదన్నారు. సంతోష్ తమ్ముడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కామారెడ్డిలో యువతి..

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌ఓ నరేష్ సోమవారం తెలిపారు. కాలనీకి చెందిన యువతి డిగ్రీ చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం తన స్నేహితుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆమె తల్లి సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

తాడ్వాయి: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న మండలంలోని దేవాయిపల్లి గ్రామానికి చెందిన ఏనుగు జైపాల్‌రెడ్డి పొలం వద్ద ఉన్న రోటవేటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. కృష్ణాజీవాడికి చెందిన కుమ్మరి శ్యాం రోటవేటర్‌ను కూడా చోరీ చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాగే పలు ఠాణాల పరిధిలో చోరీలు జరగడంతో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒక స్పెషల్ టీంను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. సీసీ టీవీలు, సాంకేతిక ఆధారాలతో కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లికి చెందిన బయమొల్ల స్వామి, తాడ్వాయి మండలం సోమారం గ్రామానికి చెందిన భోదసు సాయిలును నిందితులుగా గుర్తించామన్నారు. వీరిద్దరు గతంలో సోమారంలో జరిగిన హత్యకేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. దొంగలించిన పనిముట్లను తమవేనని నమ్మించి పెద్దమల్లారెడ్డి చెందిన మంగళి బాబుకు విక్రయించారని చెప్పారు. వారి నుంచి రోటవేటర్లు, నాగళ్లు, రూ.రెండు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సీఐ రామన్, ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు రమేష్, రాజు నాయక్, గంగారాం ఉన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

టాస్క్‌ఫోర్స్ పోలీసులకు డివిజన్‌ల కేటాయింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు డివిజన్‌లు కేటాయించారు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఇద్దరు టాస్క్‌ఫోర్స్ సీఐలతో పాటు సిబ్బందిని కమిషనరేట్ పరిధిలోని మూడు డివిజన్‌లకు కేటాయించారు. సీఐ శ్రీధర్‌ను నిజామాబాద్ నగరానికి, సీఐ వెంకటేష్‌ను ఆర్మూర్, బోధన్ ప్రాంతాలకు కేటాయించారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం, గంజాయి, అక్రమ మొరం, ఇసుక దందాలు కొనసాగుతుండటంతో ఇన్‌చార్జీ సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని డివిజన్‌ల వారీగా కేటాయించినట్లు సమాచారం.